క్లుప్తంగా

ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి

నెల్లూరు జోన్ 3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొచెర్ల ఆదాం సాహెబ్

పిడుగురాళ్ల: ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని ఆర్టీసీ నెల్లూరు జోన్ 3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొచెర్ల ఆదాం సాహెబ్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను గురువారం సందర్శించారు. ముందుగా డిపోలోని గ్యారేజిని పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తలు, సూచనలు పాటిస్తే ఆర్టీసీని మరింత లాభాల్లో నడిపించవచ్చని తెలిపారు. ఉద్యోగస్తులు నిర్వహించాల్సిన విధి విధానాలపై సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆగస్టు నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు కె.ఆదినారాయణ, వి.రాంబాబు, డ్రైవర్లు ఎంవీ నాయక్, బొప్పి రవిలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంవీ నర్రా శ్రీనివాసరావు, డిప్యూటీ సీటీఎం(కమర్షియల్) షేక్ ఇబ్రహీం, పల్నాడు ప్రజా రవాణా అధికారి ఎస్.వెంకట శ్రీనివాసరావు, పిడుగురాళ్ల డిపో మేనేజర్ ఎస్.ముక్తేశ్వరావులతోపాటు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు తెలుగు ఉపాధ్యాయుడు



పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ ఉత్తర్వుల మేరకు జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీలలో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఎ.వెంకటేశ్వర్లు నరసరావుపేటలోని స్టేడియంలో ఈ నెల 4వ తేదీన జరిగిన షెటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ పోటీలలో జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారు. ఈ నెల 8వ తేదీన షెటిల్ బ్యాడ్మింటన్, ఈ నెల 11వ తేదీన స్విమ్మింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలుగు ఉపాధ్యాయులు ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు.

పిల్లల్లో ఆరోగ్య సమస్యలపై అప్రమత్తత అవసరం

నరసరావుపేట: చిన్న పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎండీహెచ్‌వో డాక్టర్ జి.చంద్రశేఖర్ సూచించారు. వ్యాధుల్ని త్వరితగతిన గుర్తించి తగిన వైద్యం చేయాలని చెప్పారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) హాలులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం, ఫోర్‌డీ స్క్రీనింగ్ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు 330 మంది హాజరయ్యారు. పుట్టుకతో వచ్చే లోపాలు, చిన్న పిల్లలో వచ్చే వ్యాధులు, లోపాలు, చికిత్సలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డెప్యూటీ డీఎండీహెచ్‌వో చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డీఈఐసీ) నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఎంసీహెచ్ (మాటెర్నల్ అండ్ చైల్డ్ హెల్త్) హాస్పిటల్‌లో ఉందని చెప్పారు. ఇందులో పుట్టుక నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్నవారి వరకు అన్ని సమస్యలకు వైద్యం లభిస్తుందని తెలిపారు. పీడియాట్రీషిన్, మెడికల్ ఆఫీసర్, డెంటల్ మెడికల్ ఆఫీసర్, ఫిజియోథెరపిస్ట్, ఆడియోలాజిస్ట్, సైకాలాజిస్టు, ఆప్టోమెట్రిస్ట్, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, సోషల్ వర్కర్ తదితర సిబ్బంది రోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. అనంతరం జిల్లా వైద్యాధికారిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.రవిని సభకు పరిచయం చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

భార్య మృతి, భర్తకు గాయాలు

రాజుపాలెం: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన మండలంలోని అనుపాలెం సమీపంలోని కాలువ వద్ద మాచర్ల – గుంటూరు రహదారిపై గురువారం జరిగింది. బెల్లంకొండ మండలం మాచాయపాలెంకు చెందిన భార్యాభర్తలు మురికిపూడి యాకోబు, ఏసమ్మలు ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని జానపాడులోని బంధువుల ఇంటికి బయలుదేరారు. గుంటూరు నుంచి మాచర్ల వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఢీకొట్టింది. భర్త యాకోబు మార్జిన్‌లో పడిపోగా స్వల్పగాయాలయ్యాయి. భార్య ఏసుమ్మ(45) తారు రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.నారాయణ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

ముప్పాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.భవానీశంకర్ గురువారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించటం జరిగిందని తెలిపారు. తొండపి, దమ్మాలపాడు, మాదల, రుద్రవరం, బొల్లవరం, గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లోను కేంద్రాలను పరిశీలించి కేంద్రంలో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. లేని చోట తీసుకోవాల్సిన చర్యలను బీఎల్‌ఓలకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నంద నందన..

- వాడవాడలా ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్సీ జంగా..



ఆరోగ్యపురంలో శ్రీకృష్ణుడికి లక్షతులసి దళార్చన



గామాలపాడులో శ్రీ కృష్ణుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

మాచవరం: మండలంలోని మాచవరం, పిన్నెల్లి, గంగిరెడ్డిపాలెం వేమవరం గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. ఆయా గ్రామాల్లో చిన్నారుల శ్రీ కృష్ణుని వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆయా గ్రామాల్లోని దేవాలయాల వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దాచేపల్లిలో..

దాచేపల్లి : మండలంలోని గామాలపాడులో జరిగిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. గురువారం జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే పోటీలను ఆయన ప్రారంభించారు. కులమతాలకు అతీతంగా ఈ వేడుకలు జరుపుకోవటం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ జంగా అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, సర్పంచ్ జంగా సురేష్, ఎంపీటీసీ షేక్ ఆదాం సాహెబ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంగా సైదులు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ చాప శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ..

మాచర్ల: శ్రీ కృష్ణుని జన్మాష్టమి సందర్భంగా ప్రతి ఏడాది నెహ్రూనగర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకోవటం అభినందనీయమని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని నెహ్రూనగర్‌లో జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. యాదవ సంఘ నాయకులు పాదిలి అంజయ్య, నాగలి శేషయ్య, గన్నెబోయిన కొండలు, చంద్రయ్య, కొట్టు వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ మెంబర్ అల్లి జీవన్‌ల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్యలు ముందుగా శ్రీ కృష్ణునికి పూజలు నిర్వహించి ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత బోధించి కృష్ణుడు ఈ సృష్టికే రక్షకుడిగా నిలిచాడన్నారు. అనంతరం నెహ్రూనగర్‌లోని 1వ లైన్ నుంచి భారీగా యాదవులు కృష్ణునికి జే జేలు పలికి కార్యక్రమాన్ని నిర్వహించి, 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, కౌన్సిలర్లు గట్లా కోటిరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, నాగుల్ మీరా, చవ్వా బాలస్వామి, హైట్ వీరారెడ్డి, ఆర్‌కే, గంటా వేణుగోపాల్‌రెడ్డి, జంగమహేశ్వరపాడు యాదవులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తదితరులు

విజయపురి సౌత్‌లో..

విజయపురిసౌత్: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయపురిసౌత్‌లోని శ్రీ కృష్ణుని దేవాలయంలో ఆలయ ధర్మకర్త మువ్వా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్ రత్న శర్మ ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి, భజన, తులసిపూజ, పుష్పార్చన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కామనబోయిన కోటయ్య, ఐనబోయిన శ్రీను, శివ, సంతవరపు మురళి, సంతవరపు లక్ష్మీనారాయణ, కామనబోయిన వెంగయ్య, కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆరోగ్యపురం కాలనీలోని శ్రీ కృష్ణుని ఆలయంలో అర్చకులు ఓరుగంటి మారుతీ శర్మ నేతృత్వంలో పలువురు వేదపండితులు స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకాలు, సుదర్శన హోమం, లక్షతులసి దళార్చన నిర్వహించారు. అనంతరం అర్చకులు రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణ కళ్యాణ మహోత్సవంను నిర్వహించారు. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గొట్టిపాళ్ళ కృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు ,అభిషేకాలు, అర్చనలు, కీర్తనలు, భజనలు నిర్వహించారు. స్థానిక శారదానగర్‌లోని శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాలలో శ్రీ కృష్ణుని వేషధారణలో చిన్నారులు విశేషంగా ఆకట్టుకున్నారు. సాయంత్రం శ్రీ రామకృష్ణ సేవా సమితి, శ్రీ రామకృష్ణ గురుకులం ఆధ్వర్యంలో ఉట్ల స్థంబాల సెంటర్లో ఉట్టికొట్టే కార్యక్రమంలో పెద్దసంఖ్యలో యాదవ రాజు యువకులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని పోటీ పడ్డారు. విజేతలకు బహుమతులను అందచేశారు. శ్రీ వేణుగోపాలస్వామికి రుక్మిణీ, సత్యభామ సహితంగా మేళతాళాలతో గ్రామ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.



శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాలలో శ్రీకృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

కొత్తగణేశునిపాడులో గడప గడపకు..

- ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే వైఎస్సార్ సీపీ లక్ష్యం
- కొత్త గణేశునిపాడు గ్రామానికి రూ.13 కోట్లతో అభివృద్ధి
- నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా రూ.10 కోట్లు అందజేత
- ప్రభుత్వ భవన నిర్మాణాలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.3కోట్లతో పనులు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త గణేశునిపాడు గ్రామంలో సుమారు రూ.10 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా అందించినట్లు తెలిపారు. గ్రామంలో 600 కుటుంబాలు ఉండగా సగటున ప్రతి గడపకూ సుమారు రూ.లక్షన్నర వరకు లబ్ధి చేకూరిందన్నారు. గ్రామంలో సచివాలయ నిర్మాణం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ , సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలకు సుమారు రూ. 3 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. విద్యాభివృద్ధికి నాడు-నేడు ద్వారా స్కూళ్లను అభివృద్ధి చేసామన్నారు. హెల్త్ సెంటర్లు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, సాగు సలహాలు, సాగు వివరాలు, రైతు భరోసా అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటుకు పైప్‌లైన్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి కృష్ణానది నీటిని ప్రతి ఇంటికి వచ్చేలా చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్సీ కాలనీల్లో సైడ్ డ్రెయిన్స్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమాన్ని అందించడమే వైఎస్సార్ సీపీ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందుతూ జననేతకు జే జేలు పలుకుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అఖండ మెజారీతో గెలువడం ఖాయమని, పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వర ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ చల్లగుండ్ల లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి జిలుగు వెంకట నరసింహారెడ్డి, యూత్ కన్వీనర్ మద్దు ప్రసాద్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ చల్లగుండ్ల రాంబాబు, రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అలపర్తి శ్యాం, రత్తయ్య, నరసింహారావు, పిచ్చయ్య, రవి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి రెంటచింతలలో గడపగడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రెంటచింతలలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి తెలిపారు. గురువారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా స్థానిక రేగుల మాన్యం కాలనీలో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సాయంత్రం 5.30 గం.లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత కాలనీ నుంచి భారీ ర్యాలీగా ప్రధాన రహదారిలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తరువాత ఆనందపేట కాలనీలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం గడప గడప కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ఎస్టీ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

వడిత్యా శంకర్ నాయక్



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్

వెల్దుర్తి: సుగాలీ, చెంచుకాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని వజ్రాలతండా కాలనీలో పర్యటించి చెంచు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి వసతి, శ్మశాన వాటికలు, విద్యుత్, ఉపాధి వంటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ స్పందిస్తూ ఒక తండాకు శ్మశానం కోసం స్థలం కేటాయించామన్నారు. నీటి సమస్య, కరెంట్, ఉపాధి పథకం సమస్యలను ఒక నెల రోజుల్లో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను గిరిజనులకు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, మండల తహసీల్దార్, ఎంపీడీఓ ప్రసాద్, అధికారులు, గిరిజన సంఘ నాయకులు, ఇస్లావత్ హనుమంతు నాయక్, అంజి నాయక్, మునావత్ అంజి నాయక్, ఇస్లావత్ రేఖానాయక్, గ్రామ గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు పంపిణీ



దాచేపల్లి : పత్తిపంటను ఆశించే గులాబి రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ పిడుగురాళ్ల సహాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జాగృతి ప్రాజెక్ట్‌లో భాగంగా బేయర్ కంపెనీ ఆధ్వర్యంలో పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించి రైతులకు లింగాకర్షక బుట్టలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పత్తిలో గులాబి రంగు పురుగును గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని, పంటలో గులాబి రంగు పురుగు ఉధృతిని గమనించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. గులాబి రంగు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు, లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా స్పైనోసాడ్ 0.3 మిల్లీ లీటర్ల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో డి.పాపకుమారి, ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధులు ఉపేంద్రరెడ్డి, శ్రీరామన్నారయణ, బేయర్ కంపెనీ ప్రతినిధి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

21న కృత్రిమ పాదాల పంపిణీకి అర్హుల ఎంపిక

గురజాల: వాసవి క్లబ్ ఆఫ్ మాచర్ల, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ పాదాలు పంపిణీ చేసేందుకు అర్హుల ఎంపిక శిబిరం నిర్వహించడం జరుగుతుందని క్లబ్ అధ్యక్షులు తెలిపారు. ఈనెల 21వ తేదీన బి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ నందు ఈ శిబిరం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ముందస్తు రిజిస్ట్రేషన్ కొరకు 9849065882, 6301556564 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

మాచవరం: మండలంలోని వేమవరం గ్రామంలో శ్రీ చిదంబర రామలింగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి. సత్యన్నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణం సకాలంలో పూర్తి కావాలని భగవంతుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఈఓ వెంకటరెడ్డి, ట్రస్టు చైర్మన్ మూలగుండ్ల పాపిరెడ్డి, గ్రామ సర్పంచ్ గాదె కనకారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, గ్రామ పెద్దలు ఆదిరెడ్డి, రోశయ్య, పాపిరెడ్డి, ఉస్సేనయ్య, గురవారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎస్కేలు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఆదుకోవడమే లక్ష్యం

- మండలంలో కొత్తగా 543 పింఛన్లు మంజూరు
- కారెంపూడిలో నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ షఫీ

కారెంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అణగారిన పేద వర్గాల పెన్నిధి అని జెడ్పీటీసీ షేక్ షఫీ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కారెంపూడిలో గురువారం నూతన పింఛన్లను పంపిణీ చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా దరఖాస్తు చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు నూతన పింఛన్లు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి అవ్వాతాతలు అక్కచెల్లెమ్మలను ఆదుకుంటున్నారని చెప్పారు. మండలంలో 543 పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయని ఒక్క కారెంపూడి గ్రామానికే 128 నూతన పింఛన్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కసిన్యా నాయక్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాబాయి తేజానాయక్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీటీసీలు బొమ్మిన అల్లయ్యసావిత్రి, షేక్ ఆరిఫ్, అంతరగడ్డ ఏసోబు, వేముల లింగయ్య, మాజీ సర్పంచ్ కంపీ నాగరాజు, మాజీ ఎంపీటీసీ షేక్ ఖాసిమ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం

- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 15 ఎస్సీ కుటుంబాలు
- ఆహ్వానించిన ఎమ్మెల్యే పీఆర్కే



పార్టీలో చేరిన వారిని కండువాలతో స్వాగతిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బృహత్తర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై గురువారం పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని మించాలపాడుకు చెందిన ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన 15 కుటుంబాల వారు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పీఆర్కే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్ దళితుల పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. ఎస్సీ హక్కుల చట్టం ద్వారా భూములను పంపిణీ చేసి వారి కుటుంబాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. అన్ని నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి కుటుంబాలలో సంతోషాలు నింపారన్నారు. జగన్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరుగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. వైఎస్ జగన్‌కు అందరం మద్దతుగా నిలిచి మరలా ఆయనను ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులు

పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాసు



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం పలువురికి పంపిణీ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 11 మందికి రూ.11,79,000 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా పలువురికి అందజేశారు. పట్టణానికి చెందిన రొక్కం మధుసూధన్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన భార్య అనంతలక్ష్మికి రూ.2 లక్షలు, మండలంలోని కరాలపాడుకు చెందిన భక్తుల యలమందరెడ్డికి 40 వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. అలాగే మొత్తం 11 మందికి గాను రూ.11,79,000 విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతు సంక్షేమానికి ఈ-పంట నమోదే ప్రామాణికం

నరసరావుపేట రూరల్: రైతు సంక్షేమానికి ఈ-పంట నమోదును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని పాలపాడు రైతు భరోసా కేంద్రంలో ఈ-పంట నమోదును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులంతా వివరాల్ని ఈ-పంటలో నమోదు చేసుకోవాలని తెలిపారు. దీంతోపాటు తప్పకుండా ఈకేవైసీ కూడా చేసుకోవాలని సూచించారు. ఈ-పంట నమోదు వల్ల ప్రభుత్వం అమలు చేసే పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చని వివరించారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, రుణాలతో పాటు పంట నష్టపరిహారం, ఉత్పత్తుల కొనుగోలుకు కూడా ఉపకరిస్తుందని తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ముప్పాళ్ల: నరసరావుపేట నుంచి సత్తెనపల్లి వైపు వెళుతున్న కారు అదుపుతప్పి జీబీసీ కాల్వలోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లిలోని రఘురామ్‌నగర్‌కు చెందిన నరిశేటి సుందరరాజు తన కారులో నరసరావుపేట వైపు నుంచి సత్తెనపల్లి వెళుతూ కారు అదుపుతప్పి గుంటూరుబ్రాంచి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవటంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. గమనించిన స్థానికులు సుందరరాజును కాలువలోంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

అచ్చంపేట: విద్యుత్ షాక్‌కు రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని జడపల్లితండాలో గురువారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బాణావతు సత్యం నాయక్(49) గురువారం ఉదయం తనకున్న ఎకరం పొలంలో మిర్చిపంట వేసేందుకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ మోటారుకు కట్టిన తీగెలు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.